
ఈ వారం కథ



# ఫలితం

– బులుసు వేంకటేశ్వర్లు

శంకరానికి బాగా చిన్నతనంలో వాళ్ళ బామ్మ ఆంజనేయ దండకం చెప్పింది! ముద్దుముద్దు మాటల్తో శంకరం ఆ దండకం చదువుతుంటే ఆవిడ మురిసిపోయి శంకరం చేతిలో ఏ బెల్లమ్ముక్కో, పెసరపప్పో పెట్టేది! కనీసం వాటికోసమైనా శంకరం రోజుకి రెండుసార్లూ ఆ దండకం చదివేవాడు!

శంకరానికి ఏ ఏటి కాయేడు దండకం మీద భక్తి ఎక్కువైపోతూ వుండేది! ఆంజనేయ దండకం చదివితే భూతప్రేత పిశాచాలు దరికి రావుట! ఆపదలు గట్టెక్కుతాయుట! అన్నీ శుభాలు జరుగుతాయుట! చిన్నప్పుడు బామ్మ చెప్పిన మాటలు శంకరం మనస్సులో బాగా హత్తుకుపోయాయ్!

హోంవర్క్ చెయ్యకుండా క్లాసుకు వెళ్ళి – సదరు లెక్కల మాష్టారి చేతి దెబ్బలు తినకుండా వుండే నిమిత్తం కూడా శంకరం ఆంజనేయ దండకం చదువుకునేవాడు! ఫలితాలు అటూ – ఇటూ!!

స్కూల్లో మాస్ డ్రిల్లు జరిగే రోజున కనుచీకటి పడే వేళలో పుస్తకాల సంచి మోసుకుంటూ శ్మశానాల పక్కగా ఇంటికి నడిచి వచ్చేటప్పుడు అప్రయత్నంగానే శంకరం ఆంజనేయ దండకం పఠించేవాడు! 'బామ్మ చెప్పిన మాట నిజమే! క్షేమంగానే ఇంటికి చేరాను కదా!' అనుకునేవాడు!

శంకరం ఎస్సెల్సీ చదివే రోజుల్లో... పక్కింటి పంతులుగారి అమ్మాయి రాజ్యం పూచిన అంటు మామిడి మొక్కలా నవనవలాడి పోతూండేది! శంకరానికి అహోరాత్రులూ రాజ్యమే కళ్ళముందు మెదుల్తూ ఉండేది! 'ఆ చురుకూ... ఆ చిలిపితనం... ఆ అల్లరి... ఆ అందం... ఆ తెలివితేటలూ... ఓస్!!'

శంకరం తెగించి ఓ ప్రేమలేఖ రాసి – ఓ రోజు మిట్ట మధ్యాహ్నం రాజ్యం దొడ్డివైపు నూతి దగ్గర బట్టలుతుక్కుంటుంటే ఆమె దగ్గరికి విసిరేశాడు! విసిరేడే కానీ... ఆ తర్వాత శంకరానికి కాళ్ళూ చేతులూ ఆడలేదు! భయంతో గుండెలు దడదడలాడాయ్!

ఇంట్లో తిరుగుతూ సాయంత్రంలోపున వాళ్ళుసార్లైనా గడపలు తన్నేసుకున్నాడు!

రాజ్యం ఏం చేస్తుంది?? వాళ్ళ నాన్నకి చెప్తుందా?? ఆయన ఏ టైంలోనైనా వచ్చి దేహశుద్ధి చెయ్యడు కదా!!

భయం! భయం!! అన్నం సయించలేదు!!

ఆంజనేయ దండకం చదువుకుంటూ ముసుగుతన్ని పడుకున్నాడు శంకరం. ఆ మర్నాడు ఒంటరిగా ఉన్న శంకరాన్ని చూసి రాజ్యం 'జాగ్రత్త' అని బెదిరిస్తున్నట్టు చెయ్యూపి- చిన్నగా నవ్వుకుంటూ ఇంట్లోకి వెళ్ళిపోయింది!! మరి ఆ రోజు ఏం గొడవలు జరగలేదు!! శంకరం 'అమ్మయ్య!!' అనుకుని గుండెల్నిండా ఊపిరి పీల్చుకున్నాడు!

మళ్ళీ పంతులుగారింటి వైపు చూస్తే ఒట్టు!

ఆ రాజ్యానికే పంతులుగారు రెండో పెళ్ళి సంబంధం తీసుకొచ్చి పెళ్ళి చేస్తున్నారనీ... రాజ్యం తండ్రికి ఎదురు తిరిగిందనీ... ఆయన కూతురిపై చెయ్యి చేసుకున్నాడనీ... అన్నీ... అమ్మ చెప్తుంటే విని ఊరుకున్నాడు శంకరం!!

"రాజ్యమక్క సాయంత్రం అలా గుడి దగ్గరకు రమ్మంది! నీతో ఏదో మాట్లాడుతుందట" అని రహస్యంగా కబురు మోసుకొచ్చిన కుర్రాడికి కూడా ఏ మాటా చెప్పలేకపోయాడు శంకరం!!

'ప్రేమలేఖ చూపించి తనను ఇప్పుడు బ్లాక్ మెయిల్ చేస్తుందా ఏమిటి?? రెండో పెళ్ళి తప్పించుకుందుకు వల విసురుతోందా తనకి??' అనుకున్నాడు శంకరం!

పెళ్ళిపీటల మీద కూర్చునే దాకా రాజ్యానికి

"అల్లుడూ! పోయిన పండుగకి వాచ్ తీసిచ్చాను. ఈ పండుగకి ఏం తీసివ్వమంటావ్?" అడిగాడు మామ.

"ఆ వాచ్‌ని మార్వాడీ కొట్టు నుంచి విడిపించి ఇవ్వండి చాలు" బదులిచ్చాడు అల్లుడు.

— ఆనందకుమార్ రెడ్డి

కనబడకుండా మొహం చాటు చేసుకున్నాడు శంకరం!!

ముగ్గురు బిడ్డల తండ్రితో పెళ్ళిపీటల మీద కూర్చున్న రాజ్యం మాటిమాటికీ కళ్ళు తుడుచుకుంటూనే వుంది!!

రాజ్యం ఏడుస్తూనే మొగుడితో వెళ్ళిపోయింది!!

శంకరం కాలేజీ చదువుకోసం పట్నం వెళ్ళిపోయాడు!

బి.ఏ. రెండో సంవత్సరం చదువుకుంటున్న రోజులు!! నవంబర్ నెల! ఆ రోజు... ఈదురు గాలులు పిచి క్రమేపీ విశ్వరూపం చూపిస్తున్నాయ్! హోరని వాన!!

చెట్లు శివమెత్తినట్టు ఊగుతున్నాయ్!

మెరుపులు!! ఫెళ ఫెళా ఉరుములు!!

శంకరం గది తలుపులూ కిటికీలూ మూసి కూర్చున్నాడు! గుడ్డి దీపంలో కిరసనాయిలు లేదు. బయట గాఢాంధకారం!! పిచ్చిగా... వెర్రిగా కేకలేస్తున్న గాలి!!

ఆంజనేయ దండకం మననం చేసుకుంటూ ముసుగెట్టుకున్నాడు శంకరం!! అగ్గిపుల్ల వెలిగించి టైం చూసాడు - రాత్రి ఒంటిగంట!!

తలుపులు దబదబా మోగుతున్నాయ్!! దబాదబ్!! దబాదబ్!!

శంకరానికి ముచ్చెమట్లు పోసేసాయ్!!

తడుముకుంటూ వెళ్ళి కొంచెం కిటికీ తలుపు తెరిచి చూశాడు! కళ్ళు మిరుమిట్లు గొలిపే మెరుపులు!! ఆ మెరుపుల వెలుగుల్లోనే కిటికీ వైపు ఆశగా వచ్చిన ఓ తటిల్లతలాంటి అమ్మాయిని చూసాడు శంకరం!! ఆమె కంగారు పడుతోంది!! భయంగా దిక్కులు చూస్తోంది!! ఆయాసంతో నగర్చుతోంది!!

"...చాలా ఆపదలో వున్నాను! పది నిమిషాలు లోపల తలదాచుకుని వెళ్ళిపోతాను! ప్లీజ్! తలుపు తియ్యండి..." దీనమైన ఆమె కంఠం శంకరాన్ని కరిగించింది! తలుపు తీద్దామనుకున్నవాడే!! అటు వైపు ఓ అడుగు వేశాడు కూడాను!!

'కామినీ పిశాచాలు... అచ్చం పడుచు పిల్లల్లా వచ్చి బ్రహ్మచారుల గది తలుపులు తట్టుతుంటాయట! ఒక్కసారి వాటితో కలిసి సంసార మాధుర్యం అనుభవిస్తే... ఇంక ఆ మగాడు ఆ ఉచ్చు నుంచి బయటపళ్ళేట్ట!! ఆ పిశాచాలు రక్తమాంసాలు పీల్చి ఆ మగాళ్ళే చంపేస్తాయట చివరికి!!'

ఎవరో ఎప్పుడో చెప్పిన మాటలు గుర్తుకొచ్చి శంకరం అలా నిలబడిపోయాడు!! అబ్బ! ఎంత గండం గడిచింది!! ఒక్క క్షణంలో తలుపు తీసేసి ఉందును కదా!! అనుకున్నాడు శంకరం!!

వెంటనే శంకరం వెనక్కి తిరిగి బలంగా కిటికీ రెక్కనొక్కి మూసేసాడు! చిడత బిగించేసాడు!!

"ఏమండీ! ఏమండీ!! ప్లీజ్! ఒక్కసారి తలుపు తియ్యండి!!" ఉరుముల చప్పుళ్ళలో కలిసి మళ్ళా దబదబా తలుపుల చప్పుడు!! తలుపులు విరిగిపోతాయేమో అన్నంత చప్పుళ్ళు!! శంకరం చెవులు రిక్కించాడు!!

"ఒరేయ్! తలుపు తియ్యరా!! శంకరం!! ఒరేయ్!! తలుపు తియ్యి!!"

సందేహం లేదు!! కామినీ పిశాచమే!!

ఇందాకా తలుపులు తియ్యకపోవడం వల్లే కోపంతో రెచ్చిపోయినట్టుంది!! గొంతు మార్చి పిలుస్తోంది!!

శంకరం ఒణికి పోతున్నాడు!!

దండకం పైకే చదవసాగాడు!

"శ్రీ ఆంజనేయం ప్రసన్నాంజనేయం ప్రభాదివ్యకాయం - ప్రకీర్తి ప్ర...కీ...ర్తి ప్రకీర్తి... ప్ర...ప్ర..."

'ఛీ! గుర్తుకు రాదేమిటబ్బా!!' భయంతో మాట రాలేదు!!

ఆంజనేయ స్వామి ఫోటోని గుండెలపై పెట్టుకుని గట్టిగా కళ్ళు మూసుకుని పడుకున్నాడు శంకరం!!

తెల్లగా తెల్లారింది!! తలుపు తీశాడు శంకరం!!

తుఫాన్ శాంతించింది!! అల్లరి చేసి చేసి అలిసిపోయి నిద్రిస్తున్న పాపాయిలా వుంది ప్రకృతి!! ఉండుండి చిరుజల్లులు పడుతున్నాయ్!!

జనం హడావిడిగా అటూ ఇటూ పరుగులెడుతున్నారు!

వీధి చివర పెద్ద నూతిలో ఎవరో అమ్మాయి శవం అయి తేల్తోందట! చిరిగిన చీర! గాజులు పగిలిపోయి గుట్టన పడున్నాయట!! శవాన్ని బయటకు తీస్తున్నార్ట!!

శంకరం చొక్కా కూడా వేసుకోకుండా బయటకు పరుగెత్తాడు!! నూతి దగ్గరకు వెళ్ళి చూస్తే... ఆ పిల్లే!! రాత్రి... తలుపు తీయమని ప్రాధేయపడ్డ ఆ అమ్మాయే!!

"ఎవరో దుర్మార్గులు పిల్లని చెరిచేసారమ్మా!!"



అమ్మలక్కల కబుర్లు శంకరం చెవిని బడ్డాయ్!!

"ప్లీజ్! ఒక్కసారి తలుపు తియ్యండి! ఏవండీ! ఒక్కసారి..." ఆ అమ్మాయి మాటలు చెవుల్లో గింగురుమంటుంటే మతి పోయినవాడిలా రూంకి తిరిగొచ్చాడు శంకరం

రూం దగ్గర శంకరం ఫ్రెండ్స్ రాజా నరసింహం!

"ఏరా! రాత్రి రూంలో బతికున్నావా? చచ్చావా? తెల్లారగట్ల ఎంత తలుపు కొట్టినా తియ్యవ్! మన పక్కింటి మేష్టారి అమ్మాయ్ పురిటి నొప్పుల్తో బాధపడుతుంటే... డాక్టర్ని తీసుకురావడానికి నీ సైకిల్ అడుగుదామని తలుపుకొట్టాం! పోనీ నువ్వు కూడా మాకు తోడుగా వుంటావని - నువ్ తలుపు తియ్యందే??"

శంకరం సిగ్గుతో తలొంచుకున్నాడు.

"అవునూ! మన పెద్ద నూతిలో ఎవరో ఆడపిల్ల దూకి చచ్చిపోయిందట-ఏమిటి విషయం?" అన్నాడు రాజా.

"ఏ..ఏ..మో.. నాకు తెలియదు..." అన్నాడు శంకరం.

"చూసొస్తాం ఉండు " కదిలారు వాళ్ళు!!

"ఒరేయ్! మేష్టారి అమ్మాయికి ఎలా వుంది??" నెమ్మదిగా అడిగాడు శంకరం.

"రాత్రి వెళ్ళి మెడికల్ షాపువాణ్ణి లేపి మందులు తీసుకొచ్చాం! రాజుగాడు డాక్టర్ని తీసుకొచ్చాడు! డెలివరీ అయింది! తల్లీ-పిల్లా బాగానే వున్నారు" అన్నాడు నరసింహం..

శంకరం తేలిగ్గా నిట్టూర్చాడు!

> "డాడీ నే చదివే స్కూలు మార్పించవా?"
> "ఎందుకమ్మా! మీ స్కూల్లో బాగా చెప్పట్లేదా?"
> కాదు; మా స్కూల్లో శలవలు ఇవ్వటల్లేదు."
> — పి. రాంబాబు

* * *

కాలగమనంలో శంకరం చదువు ముగించి ఓ ఉద్యోగి అయ్యాడు! ఓ ఇంటివాడయ్యాడు! పుత్రవంతుడయ్యాడు! శంకరం అర్థాంగి సుమిత్ర.

పండువెన్నెల్లో ఏకైక సుతుడు బాబిగాడు పక్కన పడుకుని వుండగా మంచంపై మేను వాల్చి ఉన్నాడు శంకరం.

"నాన్నా!"

"ఊ!"

"మరి! రోజూ కరెంట్ పోతూ వుంటుంది కదా! అప్పుడు నాకు ఎంతో భయం వేస్తోంది!" బాబిగాడు అన్నాడు.

శంకరం పుత్రుడి అవస్థకు జాలిపడి పోయాడు..

ప్రేమగా బాబిగాణ్ణి దగ్గరకు తీసుకున్నాడు!

"భయం వేస్తే.. కళ్ళు మూసుకుని ఆంజనేయ దండకం చదువుకుంటే... ఇంక భయం వెయ్యదు! నీకు చెప్తాను నేర్చుకో...

"శ్రీ ఆంజనేయం - శ్రీ ఆంజనేయం ప్రసన్నాంజనేయం - ప్రసన్నాంజనేయం..."

శంకరం అర్థాంగి సుమిత్ర ఇంట్లోంచి విసురుగా వచ్చింది!

"ఆపండి ఆ దండకం! పిల్లాడికి ఏదైనా పనికొచ్చే విషయాలు చెప్పండి! కరెంటు పోతే కొవ్వొత్తి వెలిగించుకోమని చెప్పకుండా ఆంజనేయ దండకం చదువుతూ వణుకుతూ కూచోమంటారా? కరెంట్ ఎలా ఉత్పత్తి అవుతుందో, కొరత ఎలా ఏర్పడుతుందో, అందుకేం చెయ్యాలో చెప్పండి చేతయితే. కొందరు కరెంట్‌ను ఎలా దుర్వినియోగం చేస్తున్నారో, ఇంకెందరో కటిక చీకట్లోనే ఎలా బతుకీడుస్తున్నారో చెప్పండి. అంతేగానీ ఆంజనేయ దండకం నేర్పి వాణ్ణి పనికిమాలినవాడిగా చేయకండి" అని విసురుగా బాబిగాడ్ని అందుకుని వెళ్ళిపోయింది సుమిత్ర.

'ఆంజనేయ దండకం నేర్పి వాణ్ణి పనికిమాలినవాణ్ణిగా చేయకండి' అంటే బామ్మ తనకు ఆ దండకం నేర్పి అలా చేసిందనేనా? ఆ దండకం నేర్చుకునేనా తను పనికిమాలినవాడు అయింది? ఆలోచిస్తున్నాడు శంకరం.


నవోదయ రెసిడెన్షియల్ కాలేజి

(స్థాపితం: 1988)

నవోదయ మహిళా రెసిడెన్షియల్ కళాశాల

(ఈ విద్యా సంవత్సరం నుండి ప్రారంభం)

పోస్టాఫీసు ఎదురుగా, సంజీవరెడ్డినగర్, హైదరాబాద్-38

ఇంటర్ మొదటి సంవత్సరానికి Bi.P.C. M.P.C., M.E.C & C.E.C గ్రూపులలో బాలురకు మరియు M.P.C., Bi.P.C. గ్రూపులందు బాలికలకు తెలుగు, ఇంగ్లీషు మీడియములలో అడ్మిషన్లు ప్రారంభం!

★ బాలికల హాస్టలు పూర్తి భద్రతా ఏర్పాట్లలో ప్రత్యేక ప్రదేశంలో అనుకూల వాతావరణంలో కలదు.

ఇంటర్ ద్వితీయ సంవత్సరానికి పరిమితమైన సీట్లు కలవు

ముఖ్య సలహాదారులు : శ్రీ కోన రామచంద్రారెడ్డి IPS (మాజీ IGP)

| Academic Advisor | Hon•Directors |
|---|---|
| Prof.వనజా అయ్యంగార్<br>Former Vice Chancellor,<br>Padmavathi Mahila University, | Prof. నాయని కృష్ణకుమారి O U<br>Dr. T. సీత Ex. Supdt.,<br>Osmania Maternity Hospital |

దరఖాస్తులు మరియు ప్రాస్పెక్టసులకై రూ|| 15 /- M.O. / D.D. ద్వారా లేదా రూ|| 10 /- స్వయంగా చెల్లించి కళాశాల కార్యాలయం నుండి పొందవచ్చును.